



మేడారంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

# నెలాఖరుకు జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

- నాణ్యత లోపిస్తే బాధ్యులు ఇంటికే..
- మేడారానికి అదనపు నిధులిస్తాం
- కేంద్రం జాతీయ పండగ హోదా కల్పించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన

మేడారం(ములుగు జిల్లా), జనవరి 6 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనులు, ఏర్పాట్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నాణ్యత లోపించినా, సకాలంలో పనులు పూర్తికాకున్నా సంబంధిత అధికారులు ఇంటికేనని హెచ్చరించారు. శనివారం తాడ్వాయి మండలంలోని మేడారంలో పర్యటించిన సీతక్క జాతర ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, ఇతర శాఖలఅధికారులతో కలిసి పనులను పరిశీలించిన సీతక్క పలు సూచనలు చేశారు. వనదేవతల గద్దెలను దర్శించుకొని మెక్కులు సమర్పించారు. అనంతరం ఐటీడీఏ అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆతర్వాత మీడియాతో మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా.. తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసిన రూ.75 కోట్లకు అదనంగా మరిన్ని నిధులిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో అత్యంత అంగరంగ వైభవంగా జరిపిస్తామని తెలిపారు. వనదేవతల విశిష్టతను ప్రపంచం నలుమూలల తెలియజేస్తామన్నారు. జాతీయ హోదా కోసం రాష్ట్రపతిని కోరడం జరిగిందన్నారు. ఈ సారి జాతీయ హోదా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతరను కాలుష్య రహితంగా జరిపించడంలో అధికారులు, భక్తులు సహకరించాలని కోరారు.

**మేడారమంతా కలియదిరుగుతూ..**

అధికారులతో కలిసి మేడారం పరిసరాల్లో మంత్రి సీతక్క కలియదిరిగారు. ఆదివాసీ మ్యూజియాన్ని సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, సమ్మక్క, సారలమ్మ దేవతల జీవిత చరిత్రను తెలియజేయడంలో మ్యూజియం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు. మహా జాతరలో ఎక్కువ మంది భక్తులు సందర్శిస్తారని, వెంటనే పనులు మొదలుపెట్టాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. హరిత హోటల్ మరమ్మతు పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం రూ.85 లక్షలను మంజూరు చేసిందన్నారు. వీఐపీలు, వీవీఐపీలు వచ్చే రహదారుల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్, టికెట్ కౌంటర్లు, విశ్రాంతి షెడ్లు, తాగునీటి వసతులు, మరుగుదొడ్లు, క్యూలైన్లను పరిశీలించారు.

**'బంగారం' సమర్పణకు కన్వేయర్ బెల్ట్**

మేడారం వనదేవతలకు భక్తులు బంగారం(బెల్లం) సమర్పించుకొనేందుకు అధికారులు ఆధునిక పద్ధతిలో కన్వేయర్ బెల్ట్‌ను ప్రయోగాత్మకంగా ఈ జాతరలో ఉపయోగించనున్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. మంత్రి సీతక్క మేడారం పర్యటలో భాగంగా సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని గద్దెల ప్రాంగణం

మిగతా 8వ పేజీలో



కేసముద్రం మండలం కల్వలలో గొర్రెలను మేపుతున్న గొర్రెల కాపరి

# అయోమయం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 6 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకంపై ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు గొర్రెలను పంపిణీ చేస్తుందా..! లేక రద్దు చేస్తుందా..? అని అయోమయానికి గురవుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంతో రెండోవిడతలో తమ వాటాధనం కట్టిన లబ్ధిదారులు డబ్బులు తీసుకోవాలా, వద్దా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో రెండోవిడత ప్రారంభించి, ఎన్నికల సమయానికి ముందు 1,080 యూనిట్లు పంపిణీ చేశారు. ఇంకా 3,629 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అది ఆగిపోయింది.

- గత ప్రభుత్వంలో అర్ధాంతరంగా ఆగిన రెండోవిడత
- లబ్ధిదారులకు 1,080 యూనిట్ల అందచేత.. ఇంకా మిగిలింది 3,629
- వాటాధనం చెల్లించిన వారు ఎదురుచూపు

## గొర్రెల పంపిణీ ఉన్నట్లా, లేనట్లా..?!

**రెండోవిడతలో 4,709 మంది వాటాధనం చెల్లింపు..**

మహబూబాబాద్ జిల్లాలో రెండోవిడతలో 12,109 యూనిట్ల గొర్రెలు ఇవ్వడానికి జిల్లా పశుసంవర్ధశాఖ నిర్ణయించింది. గతేడాది జూన్ నుంచి అక్టోబర్ చివరి వరకు జిల్లాలో 4,709 మంది రైతులు తమ వాటాధనం కింద రూ.43,750 చొప్పున రూ.20.60 కోట్లు రైతుల ఖాతాల్లో నుంచి నేరుగా కలెక్టర్ ఖాతాల్లోకి జమ చేశారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్నాయని ఆలోచించిన మిగిలిన లబ్ధిదారులు వాటాధనం జమ చేయలేదు. కాగా, బీఆర్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో 1,080 యూనిట్లు పంపిణీ చేసిన సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గొర్రెల పంపిణీకి బ్రేక్ పడింది. ఇంకా 3,629 యూనిట్లు పంపిణీ చేయాలి. ఆ యూనిట్లకు సంబంధించిన లబ్ధిదారుల వాటాధనం రూ.15.87 కోట్లు కలెక్టర్ ఖాతాల్లో భద్రంగా ఉన్నాయి.

| మండలం | చెల్లించినవారు యూనిట్లు | పంపిణీ చేసిన యూనిట్లు | పంపిణీ చేయాల్సినవి |
|---|---|---|---|
| బయ్యారం | 373 | 96 | 277 |
| చిన్నగూడూరు | 130 | 42 | 88 |
| దంతాలపల్లి | 338 | 66 | 272 |
| డోర్నకల్ | 149 | 54 | 95 |
| గంగారం | 35 | 12 | 23 |
| గార్ల | 202 | 42 | 160 |
| గూడూరు | 190 | 60 | 130 |
| కేసముద్రం | 490 | 104 | 386 |
| కొత్తగూడ | 276 | 48 | 228 |
| కురవి | 577 | 96 | 481 |
| మహ-బాద్ | 301 | 100 | 201 |
| మరిపెడ | 447 | 60 | 387 |
| నర్సింహులపేట | 64 | 24 | 40 |
| నెల్లికుదురు | 492 | 72 | 420 |
| పెద్దవంగర | 241 | 78 | 163 |
| తొర్రూరు | 404 | 126 | 278 |
| మొత్తం : | 4,709 | 1,080 | 3,629 |

**గొర్రెల కోసం ఎదురుచూస్తున్నా..**

మంగ కట్టయ్య
పెనుగొండ, కేసముద్రం మండలం

గత సంవత్సరంలో గొర్రెల పంపిణీ పథకానికి తన పేరును ఎంపిక చేశారు. దాంతో తనదగ్గర చాలినంత డబ్బులు లేకపోవడంతో బయట నుంచి అప్పులు తీసుకువచ్చి వాటాధనం కింద రూ.43,750 చెల్లించాను. అయినప్పటికి గొర్రెల యూనిట్ పంపిణీ కాలేదు. ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. ప్రభుత్వం ఎలాగైనా గొర్రెల పంపిణీని చేపట్టాలి.

**2017-18లో గొర్రెల పంపిణీ కార్యక్రమం షురూ..**

గొర్రెల కాపరులు, యాదవులు ఆర్థికంగా లాభపడేందుకు 2017-18లో గొర్రెల పంపిణీ కార్యక్రమం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొదటి విడత (ఏ-లిస్టు) 12140 యూనిట్లు పంపిణీ చేపట్టారు. ఒక యూనిట్ అంటే 20 గొర్రెలతో పాటు ఒక పోతు పంపిణీ చేస్తారు. అయితే రెండోలిస్టు (బీ-లిస్టు) 12,109 మందిని ఎంపిక చేశారు. అయితే ఆ సమయంలో (బీ-లిస్టు)ను పంపిణీ చేయాలని గొర్రెల పెంపకందారులు, యాదవులు పలుమార్లు ఆందోళన చేపట్టారు. దీంతో గత ఏడాది రెండోవిడత గొర్రెల పంపిణీ చేపట్టారు. ఒక్క గొర్రెల యూనిట్ రూ.1.75 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.1,31,250 సబ్సిడీ అందిస్తుండగా లబ్ధిదారుడి వాటాకింద 43,750 చెల్లించాలి. అంటే రూ.158.93 కోట్లు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా రూ.52.97 కోట్లు లబ్ధిదారుడి వాటాధనం కింద చెల్లించాలి.

**ఎదురు చూపులు..**

గొర్రెల పథకం.. ఉంటుందా..? లేదా అనేది కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంతో గొర్రెల పెంపకందారులు, యాదవులు ఆందోళన చెందుతూ.. అయోమయానికి గురవుతున్నారు. గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారులు బయట నుంచి అప్పులు తీసుకువచ్చి తమ వాటాధనం కింద చెల్లించారు. అయితే చాలామంది ముందుచూపుతో వాటాధనం కట్టలేదు. కట్టిన వారికి తీరా గొర్రెల పంపిణీ ఆలస్యం జరుగుతోండడంతో వాటాధనం తిరిగి తీసుకోవాలా..? ఒకవేళ తీసుకుంటే కొత్త ప్రభుత్వంలో ఈ పథకం ప్రారంభమైతే తమకు గొర్రెలు వస్తాయా.. రావా అంటూ సందిగ్ధంలో పడుతున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకంపై ఓ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే!

**ఆందోళన వద్దు : జె.సుధాకర్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి**



రెండోవిడతలో ఆగిపోయిన 3,629 మంది లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారికి సంబంధించిన రూ.15.87 కోట్ల వాటాధనం కలెక్టర్ ఖాతాలోనే భద్రంగా ఉన్నాయి. జిల్లాకు 12,109 యూనిట్ల గొర్రెల పంపిణీ లక్ష్యం కాగా, 4,709 మంది లబ్ధిదారులు రూ.43,750 చొప్పున వాటాధనం చెల్లించారు. అందులో ఎన్నికలకోడ్ వచ్చేంత వరకు 1,080 యూనిట్లు పంపిణీ చేశాం. మిగతా యూనిట్ల పంపిణీ ఆగిపోయింది. ఈ విషయంపై ప్రభుత్వం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. వాటధనం చెల్లించిన లబ్ధిదారులు తమకు వాటాధనం కావాలని అడిగితే వారికి అందించడం జరుగుతుంది. డబ్బు వాపసు ఇచ్చినప్పటికి ఈ పథకం మంజూరైతే పేరు తొలగించడుతుందని ఆందోళన చెందవద్దు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 6 : అభివృద్ధి పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్టీసీ అధికారులతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పంచాయతీ రాజ్ శాఖలో ఇప్పటి వరకు పూర్తయిన అభివృద్ధి పనులు, జరగాల్సిన పనుల గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఆలస్యం చేయకుండా, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆపై ఆర్టీసీ ఉద్యోగులతో నిర్వహిం చిన సమీక్షలో ప్రస్తుతం ఏ రూట్లలో బస్సులు నడుస్తున్నాయి అనిఅడిగి తెలుసుకున్నారు. రవాణా సౌకర్యం లేకుండా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న మార్గాల్లో ఆర్టీసీ బస్సుసౌకర్యం కల్పించాలని చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నిచర్యలు తీసుకోవాల న్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ సురేష్, ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు

**'గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి'**

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభు త్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భూక్య మరళీనాయక్ అన్నారు. మానుకోట పట్టణంలో కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న జీవనచిత్రాలు, గీతవృత్తిని ప్రతిబింబించే విధంగా క్యాలెండర్‌ను రూపొందించిన కేజీకేఎస్ సంఘ బాధ్యులను అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న, శ్రీకాంత్, వెంకన్న, ఉప్పలయ్య, వీరస్వామి, యాదగిరి, సత్యనారాయణ, గాడిపెల్లి శ్రీనివాస్, స్వామి, సోమయ్య పాల్గొన్నారు.

**డాటా ఎంట్రీని పారదర్శకంగా చేపట్టాలి**

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నమోదు చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ సూచించారు. మహబూబాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో డాటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ మండలంలోని 41 గ్రామపంచాయతీల నుంచి సుమారు 13 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రాధిక, పంచా యతీ కార్యదర్శి సుందర్ ఉన్నారు.

**చిన్న రామోజీతండా బొడ్రాయి వేడుకలో..**

దామ్మతండా శివారు చిన్న రామోజీతండాలో బొడ్రాయి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన వేడుకలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పాల్గొన్నారు. అనంతరం బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండే విధంగా దీవించాలని వేడుకున్నట్లు చెప్పారు.

# నేడే ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

**మానుకోటలోని సమైక్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లు**



మహబూబాబాద్ టౌన్, జనవరి 6 : మానుకోటలోని సమైక్య జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రజ్యోతి వరంగల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతి రావు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సమైక్య జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేశారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఉదయం 8.30 గంటలకు కళాశాల వద్దకు చేరుకోవాలని సూచించారు. ఆపై వారికి కేటాయించిన బాక్సుల్లో ముగ్గులు వేయాల్సి ఉంటుందన్నారు. ముగ్గుల పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని వివరించారు. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండుగంటలు ఉంటుందని స్పష్టం చేశారు. పోటీలో పాల్గొనే ఔత్సాహిక మహిళలు కళాశాల వద్దకు వచ్చి ముగ్గులు వేయాలని కోరారు.

**పోటీలో పాటించాల్సిన నిబంధనలు..**

- మహిళలు మాత్రమే పాల్గొనాలి
- ముగ్గు, రంగులు, పువ్వులు, ఇతరత్రా సామగ్రి స్వయంగా తెచ్చుకోవాలి.
- చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి.
- ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు అనేవి చెప్పగలగాలి.
- ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు
- న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయం.
- ముగ్గును చేతితోనే వేయాలి. గొట్టాలు, బద్దలు వంటివి ఉపయోగించి వేయకూడదు. జల్లెడ మాత్రం ఉపయోగించవచ్చు.
- ముగ్గుల్లో గొబ్బెమ్మల వంటివి అమర్చవచ్చు. ఇతరత్రా వస్తువులు ఎక్కువగా అమర్చకూడదు. ముగ్గుకు అందం ఇవ్వడానికి ఇతర వస్తువులు వాడాలి. తప్పితే ఆ వస్తువులనే ప్రధానంశంగా చేసుకోకూడదు.

# ముగిసిన 'ప్రజాపాలన'

- జిల్లాలో అభయాహస్తం దరఖాస్తులు 2,44,506
- ఇతర అప్లికేషన్స్ 65,114

మహబూబాబాద్, జనవరి6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీలను అమలు చేసేందుకు డిసెంబర్ 28వ తేదీ నుంచి ప్రారంభించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగిసింది. డిసెంబర్ 30వ తేదీ ఆదివారం, జనవరి 1న సెలవు దినాలు మినహా మిగతా 8రోజులు గ్రామాలు, మునిసిపాలిటీల్లోని వార్డుల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. అందుకోసం జిల్లాలో ప్రత్యేకంగా 49 బృందాలను ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో 461 గ్రామపంచాయతీలు డోర్నకల్, మరిపెడ, మానుకోట, తొర్రూరు మునిసిపాలిటీల పరిధిలోని 82 వార్డుల్లో మొత్తంగా 543 గ్రామసభలు నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో మానుకోట,పాలకుర్తి, ఇల్లందు, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, యశస్వినిరెడ్డి, కోరం కనకయ్య, జాటోతు రాంచంద్రునాయక్‌లు హాజరై గ్రామసభల ద్వారా సందేశాన్ని అందించి, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాపాలన సభలు జరిగిన రోజున వందకుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఐదు నుంచి ఆరు కౌంటర్లను ఏర్పాటు చేయగా మిగతా రోజుల్లో రెండు కౌంటర్లను ఏర్పాటు చేసి అభయహస్తం, ఇతర దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా, మండల అధికారులు పర్యవేక్షిస్తూ ప్రజాపాలనను పూర్తిచేశారు. జిల్లాలో 2,44,506 అభయహస్తం కోసం దరఖాస్తులు చేసుకోగా 65,114 మంది రేషన్‌కార్డు, ఇతరత్రా సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. వెరసి మొత్తంగా 3,09,620 దరఖాస్తులు అందాయి.



మహబూబాబాద్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

మండలాల వారిగా పట్టిక వివరాలు 8లో..

# చెరువులో పడి ఒకరు మృతి



బందు మహేందర్ (ఫైల్)

తొర్రూరు రూరల్, జనవరి 6 : తొర్రూరు మండలం వెల్లికట్టెలో చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. వెల్లికట్టకు చెందిన అనారోగ్యంతో విశ్రాంత కండక్టర్ బందు భిక్షం మృతి చెందాడు. భిక్షం అంత్యక్రియలకు గ్రామస్థులతో పాటు బందు మహేందర్ (35) కూడా హాజరయ్యాడు. అంత్యక్రియల అనంతరం చెరువులో స్నానం చేయడానికి వెళ్లగా, కాళ్లకు నాసు చుట్టుకొని నీటిలో మునిగి మహేందర్ మృతి చెందినట్లు తెలిపారు. కాగా, మృతుడికి భార్య సరస్వతి, కుమారుడు రాజేష్, కుమార్తె వర్షిని ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

## రాష్ట్రంలో రెండు ఎంపీ సీట్లు మాదిగలకు కేటాయించాలి

### మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

హనుమకొండ రూరల్, జనవరి 6: రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న మాదిగలకు అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలు కేటాయించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. శనివారం అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైన ఉపేందర్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ.. మాదిగలను మోసం చేసిన బీజేపీ తరుపున మంద కృష్ణ వరంగల్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తే.. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానని అన్నారు. మాదిగ ఉద్యమాన్ని పట్టించుకోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాదిగ జేఏసీ కృషి చేస్తుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ, మాదిగ ఉపలకులాల ఓట్లను దండుకోవడానికే బీజేపీ తెర లేపిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి ధీరన్, బి.వీరేందర్, వి.శోమచంద్రశేఖర్, ఓ.శంకర్, ఎం.ఆరోగ్యం, సంపత్, ఉపేందర్, మధుకర్, అశోక్, రవి, అనిల్, గోపి, రామ్‌కుమార్, శ్రీనివాస్, కిషన్, మోహన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 6: గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా www.tsbcstudycircle.cgg.-gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన కోరారు.

## ఇంజనీరింగ్ అధికారుల చేరిక అదనపు బలం

### ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జగన్మోహన్‌రావు




సభ్యత్వ రశీదును అందచేస్తున్న జగన్మోహన్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 6: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మిళితం కావడం తమకు అదనపు బలాన్ని ఇచ్చిందని టీజీవో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జగన్మోహన్‌రావు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా టీఎస్‌సీపీఎస్‌ఈయూ కన్వీనర్ ఏఈ దొడ్డపాటి హరికుమార్ ఆధ్వర్యంలో టీజీవోలో మిళతం చేసే కార్యక్రమం శనివారం జరిగింది. హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలోని టీజీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన జగన్మోహన్‌రావు మాట్లాడారు. జీడబ్ల్యూఎంసీ ఏఈలు టీజీవో చేరడం అభినందనీయమన్నారు. ఇంజనీరింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఇంజనీరింగ్ అధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రవళి, మిజముల్, సౌజన్య, రాగి శ్రీకాంత్, మేనక, అజ్మీరా శ్రీకాంత్, విజయలక్ష్మి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ కిష్ణయ్య సస్పెన్షన్

### వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సస్పెండ్ ఉత్తర్వులు జారీ



కేయూ క్యాంపస్, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఆడిట్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.కిష్ణయ్యను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5న శుక్రవా రం కేయూ ఆడిట్ కార్యాలయంలోని ఏఆర్ కిష్ణయ్య తన చాంబర్‌లో వర్సిటీ హస్టల్స్‌కు పాలు, పెరుగు సరఫరా చేసే కాంట్రాక్టర్ పి.రాజేందర్ నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కాడు, ఈ నేపథ్యంలో శనివారం కిష్ణయ్యను ఏబీసీ కోర్టుకు సంబందిత పోలీసులు అధికారులు హాజరుపరిచారు. హైదరాబాద్‌లోని ఏసీబీ మేజిస్ట్రేట్ కిష్ణయ్యను 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించగా చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ పోలీసుల అరెస్ట్, రిమాండ్, ఏసీబీ డిఎస్పీ సమాచారం ఆధారంగా కిష్ణయ్యను శాఖపరమైన చర్యల్లో భాగంగా ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తదుపరి చర్యలు కోర్టు ఉత్తర్వుల మేరకు ఉంటాయని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు స్పష్టంచేశారు.

### కేయూ ఏఆర్ కిష్ణయ్య ఇంట్లో ఏసీబీ సోదాలు

కేయూలో శుక్రవారం మధ్యాహ్నం ఆడిట్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్ణయ్య ఇంట్లో శనివారం ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. వర్సిటీలో కిష్ణయ్య ఆఫీస్‌లోనూ పనిచేస్తున్న తోటి ఉద్యోగుల వివరాలు, ఫోన్‌నెంబర్లను సేకరించారు. కిష్ణయ్య ఇంట్లో పెద్ద ఎత్తున బంగారంతో పాటు నగదు, దస్తావేజులు, ఇతర వివరాలను ఏసీబీ  పోలీసులు సేకరించారు. కిష్ణయ్య అక్రమ ఆస్తులను గుర్తించినట్లు తెలుస్తోంది. కాగా, కిష్ణయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## బావిలో దూకి యువతి ఆత్మహత్య

మరిపెడ రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 6 : అనుమానాస్పదంగా బానోతు చామంతి (18) అనే యువతి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మూలమర్రి తండాలో చోటు చేసుకుంది. మృతురాలు తండ్రి శ్రీను, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. మూలమర్రి తండాకు చెందిన బానోతు శ్రీను-చిలకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకూతురుకి వివాహమైంది. అనారోగ్యంతో మూడేళ్ల క్రితం చిలకమ్మ మృతి చెందింది. రెండో కుమార్తె చామంతి వాల్యాతండాకు చెందిన వాసు అనే యువకుడితో ప్రేమలో పడింది. గత 20 నెలల క్రితం చామంతి, వాసుకు వాగ్వావాదం జరిగింది. దీంతో ఆమె పురుగుల మందు సేవించింది. ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. చామంతి చికిత్సకు సుమారు రూ.3లక్షల ఖర్చు అయింది. ఆ తర్వాత పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి, వాసుకు రూ.4 లక్షలు జరిమానా విధించారు. అయితే ఈమధ్య కాలంలోనే వాసు, చామంతి ఇద్దరూ కలవడం జరిగింది. ఈ నేపథ్యంలో చామంతి, వాసును పెళ్లి చేసుకోమని అంటే వాసు తాను ఇచ్చిన రూ.4 లక్షలు ఇస్తేనే పెళ్లి చేసుకుంటాను అని అంటున్నాడని వారు తెలిపారు. చామంతి తండ్రి శ్రీనుకు కేవలం 15 గుంటల వ్యవసాయ భూమి మాత్రమే ఉంది. ఈ క్రమంలో ఈనెల 2న మండల కేంద్రంలోని ఓ థియేటర్‌లో సినిమా చూసి, తానంచర్లకు వెళ్లి వాసుకు ఫోన్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటాను అని చెప్పి, మూలమర్రి తండా శివారు రైతు వేదిక వద్ద వ్యవసాయ బావిలో దూకి చామంతి ఆత్మహత్య చేసుకుంది. కాగా, వ్యవసాయ పొలంలో ఉన్న గిరిజనులు శనివారం బావి వద్దకు వెళ్లగా మృతదేహం తేలియాడుతూ కన్పించింది. వెంటనే వారు పోలీసులుకు సమాచారం అందివ్వగా పోలీసులు వెళ్లారు. తండ్రి బానోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహెర్‌బాబా తెలిపారు.



# ‘ట్రాఫిక్’లో వసూళ్ల దందా

**తనిఖీల్లో కొందరు అధికారుల చేతివాటం ● డ్రంకెన్ డ్రైవ్ టార్గెట్ పేరుతో అక్రమ సంపాదన ● కొన్ని చోట్ల ప్రయివేటు వ్యక్తులతో దందా**

**ట్రాఫిక్ విభాగంలో వసూళ్ల పర్వం పెచ్చుమీరిపోతోంది. తనిఖీల పేరుతో వాహనదారుల జేబులు గుల్ల చేస్తున్నారు. కొందరు అధికారులు సంపాదనే ధ్యేయంగా దిగజారుతున్నారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్ వారికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఎవరైనా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే చాలు.. ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. అలాగే నెలవారీగా ఇసుక వాహనాలు, క్వారీ, రెడ్‌మిక్స్ తదితర వాటి నుంచి వచ్చే మామూళ్లతో లక్షలకు పడగెత్తుతున్నారు. వాహనదారులను పీల్చి పిప్పి చేస్తున్న కొందరు ట్రాఫిక్ పోలీసులపై సీపీ అంబర్‌కిషోర్ ఝా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే యువకుల నుంచి డబ్బులు తీసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ డేవిడ్‌ను సస్పెండ్ చేశారు. దీంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.**

హనుమకొండ క్రైం, జనవరి 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో కొందరు అధికారుల తీరు పోలీసు శాఖకే మచ్చ తీసుకువస్తోంది. తనిఖీల్లో అక్రమ సంపాదనే ధ్యేయంగా అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తి దొరికితే చాలు.. ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. సాధారణంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని ప్రయివేటు పార్కింగ్ సెంటర్లలో ఉంచుతారు. నిజానికైతే అక్కడ రోజుకు రూ.10 చార్జి చేయాలి. కానీ పార్కింగ్ యజమానులు వాహనదారుడి నుంచి రోజుకు రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేసి ట్రాఫిక్ సిబ్బందికి ప్రతీ నెలా మామూళ్ల రూపంలో అప్పగిస్తారనే ప్రచారం ఉంది. ఇక ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడితే రూ.10వేలు ముట్టజెప్పనిదే వదలరు. ఇలా ఇటీవలకాలంలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు ట్రాఫిక్ పోలీసులకు తాగి పట్టుబడి డబ్బులు ముట్టజెప్పి మరీ తేలు కుట్టిన దొంగలా కిక్కురుమనకుండా మిన్నకుండిపోయారు.

**డ్రంకెన్ డ్రైవ్‌లే ఆదాయంగా..**

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని ఓ పోలీసు పరిధిలో పని చేస్తున్న అధికారికి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఆదాయమార్గంగా ఏర్పడింది. పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ప్రతీరోజూ టార్గెట్‌గా చేయాల్సిన డ్రంకెన్‌డ్రైవ్‌ల పేరుతో అందినకాడికి దండుకుంటున్నాడనే విమర్శలు వస్తున్నాయి. తన సర్వీసు ముగింపునకు దగ్గరగా ఉండడంతో ఇదే అదును గా భావించి నాలుగురాళ్లు వెనకేసుకునే పనిలో పడ్డాడు. ఇలా ప్రతీ రోజూ రూ.10వేలకు తక్కువ కాకుండా పలు సెంటర్‌లలో అడ్డాపెట్టి వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ పేరుతో సంపాదనకు ఎగబడ్డాడు. తన వద్ద ఇద్దరు నమ్మకస్తులైన వ్యక్తులు ఒక ప్రైవేటు డ్రైవర్, ఒక హోంగార్డును వెంటేసుకుని నగర ప్రజలను డబ్బుల కోసం నరకం చూపిస్తున్నాడు.

**మందుబాబుల జేబులు గుల్ల**

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తులను కోర్టు కానిస్టేబుళ్లతో పాటు సంబంధిత ట్రాఫిక్ పోలీసు అధికారులు అందిన కాడికి దండుకుంటారనే ప్రచారం ఉంది. మందుబాబుల జేబుల ను ఓ కోర్టు కానిస్టేబుల్ గుల్ల చేస్తున్నాడనే విమర్శలున్నా యి. ఇలా లక్షలకు పడగెత్తే కానిస్టేబుల్.. సంబంధిత సీఐ కి నెలకు రూ.1లక్ష లంచం ఇస్తున్నాడంటే ఏమేరకు వసూలు చేస్తున్నారో అర్థమవుతోంది. బాధితులనుంచి రూ.3 వేలకు పైగా వసూలు చేసి సంబంధిత స్టేషన్ అధికారికి పర్సంటేజీ లెక్క ముట్టజెబుతున్నాడు. అయితే పట్టుబడిన వ్యక్తి కోర్టులో చెల్లించాల్సిన డబ్బుల కంటే సదరు కోర్టు కానిస్టేబుల్‌కు చెల్లించే డబ్బే ఎక్కువవుతోందని లబోదిబోమంటున్నారు.

**నెలవారి మామూళ్లు**

ఇసుక డంపులు, మొరం ట్రాక్టర్లు, ఆటో అడ్డాలు, రెడ్‌మిక్స్ యజమానులనుంచి ఒక్కో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు రూ.5లక్షల వరకు మామూళ్లు వస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతుంటే పోలీసులు ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా సీపీ సార్.. జర ట్రాఫిక్ అధికారులపై దృష్టి సారించి సామాన్యులను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రయివేటు వ్యక్తుల హవా

వారు పోలీసు కానిస్టేబుళ్లు కాదు.. హోంగార్డులు అసలే కాదు.. కానీ ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారి వెనకాల పరుగెత్తి మరీ పట్టుకుంటారు.. వాహన యజమాని అనుమతి లేకుండానే బైక్ తాళం లాక్కుని అధికారి వద్దకు తీసుకెళతారు. వారు అనుకున్న ప్రకారం డబ్బులు ముట్టజెబితే వదిలేస్తారు.. లేదంటే వారే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేసి కోర్టుకు వెళ్లేలా చేస్తారు.. ఇటీవల వరంగల్ పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ప్రయివేటు వ్యక్తుల విచ్చలవిడితనం పెరిగిపోయింది. ఎస్ఐ, ఆర్ఎస్ఐ, సీఐ స్థాయి అధికారుల వద్ద పని చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అధికారులకంటే వీరే ఎక్కువ ఫోజులు కొడుతూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు ట్రాఫిక్ విభాగంలో చేరి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో చాలా చోట్ల ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

## ట్రాఫిక్ ఎస్ఐ డేవిడ్‌పై వేటు

**యువకుల నుంచి డబ్బులు వసూలు చేయడంతో సస్పెన్షన్**

హనుమకొండ క్రైం, జనవరి 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సిలివేరు డేవిడ్‌ను సీపీ అంబర్ కిశోర్ ఝా సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు యువకుల నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోవడంతో విచారణ చేపట్టిన సీపీ.. ఎస్ఐ డేవిడ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే..

ఇటీవల హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలో ఎస్ఐ డేవిడ్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆపాడు. వాహన పత్రాలు లేకపోవడంతో విద్యార్థులను ఎస్ఐ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీ లేక విద్యార్థులు రూ.500 ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ తతంగాన్ని బాధిత యువకుల స్నేహితులు అక్కడే ఉన్న భవనంపై నుంచి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఆపై ఎస్ఐ డేవిడ్ డబ్బులు తీసుకుంటున్న వీడియోను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మరి కొందరు ఎస్ఐ నిర్వాకాన్ని సీపీ అంబర్ కిశోర్ ఝాకు పంపించారు. దీంతో సీపీ నిఘా వర్గాల ద్వారా విచారణ చేయించారు. నిజమని తేలడంతో శనివారం విధుల నుంచి తొలగించారు.



**వివాదాస్పదుడు**

ఎస్ఐ డేవిడ్‌కు ఆది నుంచి వివాదాస్పదుడిగా పేరుంది. కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ఎస్ఐ ర్యాంకర్‌గా పదోన్నతి పొందిన డేవిడ్.. గతంలో వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో రెండేళ్లు పనిచేశారు. అక్కడి ప్రజలను, సిబ్బందిని డబ్బుల కోసం ఇబ్బంది పెట్టడంతో అప్పటి సీపీ రంగనాథ్ డేవిడ్‌ను కొడకండ్ల పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ సిబ్బందితో గొడవ పడడంతో హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ మూడు మాసాల్లో వాహనదారులను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టినట్టు తెలిసింది. దీంతో కొందరు ఎస్ఐ అక్రమాలకు చెక్ పెట్టేందుకు డబ్బులు తీసుకుంటున్న వీడియోను సీపీకి పంపించడంతో విధుల నుంచి తొలగించారు.

## టెక్స్‌టైల్ పార్క్ సమస్యలు పరిష్కరించాలి

మడికొండ, జనవరి 6: మడికొండ శివారు టెక్స్‌టైల్ పార్కులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక టెక్స్‌టైల్ వ్యాపారులు శనివారం రాష్ట్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదారాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కొవిడ్ మహమ్మారి టెక్స్‌టైల్ మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేయడంతో బ్యాంక్ చార్జీలు, వడ్డీలు కూడా చెల్లించలేనేని పరిస్థితి నెలకొందన్నారు. బ్యాంక్ వడ్డీలు, చెల్లించడానికి చేతిలో చిల్లి గవ్వకూడా లేదని తెలిపారు ప్రభుత్వం సహకరించి ఫ్యాక్టరీలు సక్రమంగా నడిచి తమ జీవితాల్లో వెలుగులు నింపే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ మేరకు వినతి పత్రంలో పేర్కొని మంత్రిని కోరినట్లు మడికొండ టెక్స్‌టైల్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కూరపాటి విజయ్‌కుమార్, దగ్గు రవిందర్‌రావు, మామిడి రాజు, మచ్చ వీరన్న, డాక్టర్ వెంకట్‌రాములు, రంగస్వామి, తిరుపతి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న లారీ

**ప్రైవేటు టీచర్ మృతి**




హనుమకొండ టౌన్, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్ భీమారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు సునయన(25) మృతి చెందారు. భీమారం సమీపంలోని స్కిల్ స్ట్రోక్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేస్తున్న సునయన తోటి ఉపాధ్యాయుడు విశ్వచటర్జీతో కలిసి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళుతోంది. ఈ క్రమంలో భీమారం పెట్రోల్ బంక్ ముందు హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న సునయన లారీ వెనుక చక్రాల కింద పడిపోగా నడుపుతున్న విశ్వచటర్జీ పక్కకు పడిపోయాడు. లారీ చక్రాల కింద పడిపోయిన సునయన నడుము నుంచి కాళ్ల వరకు నుజ్జునుజ్జు అయ్యాయి. విశ్వ చటర్జీకి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారయ్యాడు.

సమాచారం అందుకున్న కేయూ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. తీవ్రగాయాలైన సునయనను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సునయన మృతి చెందింది. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కాగా ముంబయికి చెందిన సునయన రెండేళ్లుగా ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా చేస్తూ భీమారం సమీపంలోని బ్యాంక్ కాలనీలో అద్దెకు ఉంటోంది. సునయన మృతి పట్ల పాఠశాల చైర్మన్ తిరుమల్‌రావు, డైరెక్టర్ అనూప్ సంతాపం తెలిపారు.


లారీ చక్రాల కింద సునయన

# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

మహబూబాబాద్‌టౌన్, జనవరి 6 : నూతన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన అద్వైత్‌కుమార్‌సింగ్‌ను శనివారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 5న కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన అద్వైత్‌కుమార్ సింగ్‌ను మహబూబా బాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కలిసి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకుడు రమేష్‌చందర్‌రెడ్డి ఉన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ ఎమ్డీ. ఫరీద్, బీఆర్‌ఎస్ అర్బన్ అధ్యక్షుడు గద్దె రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్‌నాయక్, కత్తుల ఏలేందర్ పాల్గొన్నారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, కౌన్సిలర్ మార్నేని వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు తేళ్ల శ్రీను, యాళ్ల మురళీధర్ రెడ్డి, మార్నేని రఘు, డౌలాగర్ శంకర్, కర్పూరపు గోపి, షేక్ ఖలీల్ పాల్గొన్నారు. తెలంగాణ (కాకతీయ) ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**ఫిబ్రవరి 15న సెలవుదినంగా ప్రకటించాలి : సేవాలాల్‌సేన**

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున ఫిబ్రవరి 15న ప్రభుత్వం అధికారికంగా సెలవుదినంగా ప్రకటించాలని సేవాలాల్‌సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దరావత్ వెంకన్ననాయక్ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకన్ననాయక్ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీసం తుసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు కేటాయించాలని, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలకు రూ.10 లక్షల చొప్పున కేటాయించాలని కోరారు. సేవాలాల్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు దరావత్ మోతీలాల్, గుగులోతు నందులాల్, బాదావత్ రాంబాబు, మాలోతు సురేష్‌నాయక్, నరేందర్, సురేష్ పాల్గొన్నారు.

## దరఖాస్తులను నమోదు చేయాలి

**● వరంగల్ ఆర్‌డీఎంఏ సాహెద్‌మసూద్**

మహబూబాబాద్ టౌన్, జనవరి 6 : ప్రజాపాలన దరఖాస్తులను ఎలాంటి తప్పులు దొర్లకుండా పూర్తి అవగాహనతో ఆన్‌లైన్ చేయాలని వరంగల్ రీజనల్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ (ఆర్‌డీఎంఏ), ఉమ్మడి వరంగల్ మునిసిపాలిటీల ప్రజాపాలన ప్రత్యేక అధికారి సాహెద్ మసూద్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో శనివారం ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు చేశారు. మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణి, మేనేజర్ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దండె శ్రీహరి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

డోర్నకల్, జనవరి 6 : మండలంలోని పెరుమాండ్ల సంకీస శివారు కాంపెల్లి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. గార్ల మండలం మర్రిగూడెం గ్రామం గ్యామతండా చెందిన భూక్య కృష్ణ సొంత పనుల నిమిత్తం తన ద్విచక్రవాహనంపై కాంపెల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సరిగ్గా పెరుమాండ్ల సంకీస శివారు కాంపెల్లి క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో కృష్ణకు తీవ్రగాయాలు కావడంతో ఇది గమనించిన స్థానికులు 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

సీరోలు, జనవరి 6 : ఉప్పరగూడెంలో ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన వీరబోయిన రామయ్యకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమవుతుండగా ఇది గమనించిన సర్పంచ్ కాలం తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ తోట రమేష్, ఎల్. వెంకన్న, బెన్నబోయిన ఉపేందర్‌లు వెంటనే 100కు డయల్ చేయగా అక్కడకు చేరుకున్న ఫైర్ ఇంజన్ చేరుకుని మంటలను అదుపు చేశారు. పశువుల మేతకు ఉపయోగపడే గడ్డిదగ్ధం కావడం బాధితుడు వీరబోయిన రామయ్య బోరున విలపించాడు.

# 'ప్రతీ లబ్ధిదారుడికి సంక్షేమ పథకం'

తొర్రూరు రూరల్, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి అందేవిధంగా చర్యలు చేపడుతామని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజాపాలన కార్యక్రమం చివరిరోజు కర్కాలలో పాల్గొని, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకం అందించాలనే లక్ష్యంతో స్వయంగా ప్రజల వద్దకే వచ్చి, మధ్యవర్తులు లేకుండానే నేరుగా ప్రజలకు పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హులైన వారిని గుర్తించి పథకాలు అందజేస్తామని, ఎవ్వరికి ఎలాంటి లంచాలు ఇచ్చి మోసపోవద్దన్నారు. అనంతరం హరిరాల ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కర్కాల పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న



కర్కాలలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

భోజనం ప్లేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఇట్టె శ్యాంసుందర్ రెడ్డి, సర్పంచ్ సురేఖ, ఉప సర్పంచ్ పసులాది వెంకన్న, ఎంపీటీసీ గోపమ్మ, తహసీల్దార్ వినోద్‌కుమార్, ఎంపీడీవో కుమార్, ఎంపీవో గౌస్, మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాగా, గత వారం రోజులుగా జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 19 వేల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**ప్రజలకు చేరువుగా ప్రజా పాలన**

● బయ్యారం : ప్రజలకు చేరువుగా రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతున్నట్లు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కాచనపల్లిలో చివరి రోజు జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంతో దశాబ్ద కాలంగా దొరల గడిలో బందీగా మారిన తెలంగాణకు స్వేచ్ఛ లభించినట్లైందన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, మండల ప్రత్యేక అధికారి రాజా నరేందర్, తహసీల్దార్ ఇమానీయల్, సర్పంచ్ వజ్జ భద్రయ్య ఉప సర్పంచ్ పాండు, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సోమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, శ్రీనివాస్ రెడ్డి, రామునాయక్, నాగేశ్వరరావు, భద్రయ్య, ప్రభాకర్ రెడ్డి, వెంకటపతి, ప్రవీణ్‌నాయక్, శ్రీను, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**● తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ మట్ట సరిత**

తొర్రూరు రూరల్, జనవరి 6 : విద్యార్థులు న్యాయపరమైన చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ మట్ట సరిత అన్నారు. శనివారం చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం మహంకాళి బుచ్చయ్య అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాసరిత మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని, చెడు అలువాట్లకు దూరంగా ఉండాలని, సెల్ ఫోన్లు ఎక్కువగా చూడవద్దన్నారు. విద్యా సమాచార హక్కుచట్టం ప్రకారం ప్రతీ ఒక్కరు విద్యను అభ్యసించాలని, ఆరు బయట పనిచేయడానికి వీలులేదన్నారు. బాల్యవివాహాలను జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరుపై ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరిగిన ఎలాంటి భయాందోళన, మొహమాటం లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్సై అరుణ, న్యాయవాదులు రామకృష్ణ, గౌస్, ఉపాధ్యాయ బృందం సబియాభాను, యాకూబ్‌అలీ, జైపాల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మల్లేశం, నర్మద పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

నెహ్రూసెంటర్, జనవరి 6 : జిల్లాలోని మూడు ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి బాదావత్ కిరణ్‌నాయక్ తెలిపారు. శనివారం ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాళ్లపూసపల్లి, కేసముద్రం మండలంలోని మేగ్యతండా, గూడూరు మండలంలోని తీగలవేణి, మరిపెడ, డోర్నకల్ మండలంలోని తెల్లబండతండా, సాదుతండా, సీరోలు మండలంలోని మన్నెగూడెం గ్రామాల్లో శనివారం ఉదయం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు, రూట్‌వాచ్ నిర్వహించారు. ఈ దాడుల్లో 8 కేసులు నమోదు చేసి, 11 మందిని ఆయా తహసీల్దార్‌ల ముందు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. 400 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి, వారినుంచి 95 లీటర్ల నాటుసారా, 320 కిలలో నల్లబెల్లం, 50 కిలోల పట్టిక, రవాణాకు ఉపయోగించిన ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ కృష్ణ, ఎక్సైజ్ పోలీసులు హరీష్, చిరంజీవి, బిక్షపతి, కృష్ణమూర్తి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## మానుకోటలో గుండెపోటుతో వ్యక్తి మృతి

**● మృతుడు ఖమ్మం జిల్లావాసి**

నెహ్రూసెంటర్, జనవరి 6 : హైదరాబాద్ వెళ్లేందుకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం తట్టెలపాడు గ్రామానికి చెందిన వంగూరి రాంబాబు (30) తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లేందుకు మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. 2వ ప్లాట్‌ఫాంపై రైలు ఎక్కేందుకు సిద్ధంగా ఉండగా అప్పటికే ఛాతిలో నొప్పి అంటూ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న భార్య నవ్య స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయంపై డోర్నకల్ జీఆర్పీ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఈ ఘటన ఇంకా తమ దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తొర్రూరు రూరల్, జనవరి 6 : మండలంలోని కంఠాయపాలెంలో ఓవ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కంఠాయపాలెంకు చెందిన బోడెపల్లి శ్రీకాంత్ (35) మద్యం తాగుతు ఉండేవాడు. పలుమార్లు చెప్పినా మద్యం మానివేయకపోవడంతో భార్య పావని శ్రీకాంత్‌ను వదిలేసి, పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తల్లిదండ్రులతో గొడవపడేవాడు. ఈక్రమంలో ఇంటి వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు, స్థానికులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, బాధితుడికి భార్య పావని, కుమారుడు ఉన్నారు.



ములుగులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

## టీఎస్ ఏటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీతక్క

కొత్తగూడ, జనవరి 6 : టీఎస్ ఏటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క ములుగులో శనివారం ఆవిష్కరించారు. టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు మంత్రికు కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఏజెన్సీలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతక్కకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి, రాష్ట్రప్రధాన కార్యదర్శి కుర్సం అంజయ్య రాష్ట్ర కార్యదర్శులు కృష్ణ, నాగేందర్‌రావు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన భిక్షం, నాయకులు పాల్గొన్నారు.

● టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఓటాయిలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లెల సాంబయ్య ఆవిష్కరించారు. మమత, రేణేశ్వర్, యాదగిరి, రమేష్, కోటేశ్వర్, ప్రభాకర్, మదన్‌మోహన్, సాంబయ్య, రాజు పాల్గొన్నారు.

## ఘనంగా బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

నర్సింహులపేట, జనవరి 6 : మండలంలోని పెద్దనాగారం జగ్గుతండా జీపీ పరిధిలోని అమీర్యతండాలో బంగారు మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం ఘనంగా జరిగింది. పూజారి సంతోష్ పర్యవేక్షణలో అర్చకుల బృందం హోమం నిర్వహించి, గణపతి పూజతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొలిమెర కట్టు అనంతరం బంగారు మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం సంప్రదాయ పద్ధతులతో ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మాజీఎమ్మెల్యే రెడ్యానాయక్, ఎంపీపీ టేకుల సుశీల యాదగిరిరెడ్డి అమ్మవారికి మొక్కుకున్నారు. సర్పంచ్ అజ్మీర హోళీనాయక్, ఎంపీటీసీ అజ్మీరనాయకీ లింగ్యా, ఉప సర్పంచ్ అజ్మీర సరోజ రంగ, వార్డుసభ్యులుపాల్గొన్నారు.

## ముగిసిన 'ప్రజాపాలన'

**● మండలాల వారిగా వచ్చిన దరఖాస్తుల వివరాలు**

| మండలం | అభయహస్తం దరఖాస్తులు | ఇతర దరఖాస్తులు | మొత్తం |
|---|---|---|---|
| బయ్యారం | 15776 | 3262 | 19038 |
| చిన్నగూడూరు | 4691 | 1390 | 6081 |
| డోర్నకల్ | 10911 | 3511 | 14422 |
| దంతాలపల్లి | 9747 | 3026 | 12773 |
| గూడూరు | 18799 | 6784 | 25583 |
| గంగారం | 3050 | 1105 | 4155 |
| గార్ల | 11376 | 2566 | 13942 |
| ఇనుగుర్తి | 5904 | 908 | 6812 |
| కేసముద్రం | 17889 | 4035 | 21924 |
| కొత్తగూడ | 6917 | 1974 | 8891 |
| కురవి | 15716 | 4553 | 20269 |
| మహ-బాద్ | 13427 | 3888 | 17315 |
| మరిపెడ | 16696 | 5023 | 21719 |
| నెల్లికుదురు | 15912 | 4210 | 20122 |
| నర్సింహులపేట | 8842 | 2657 | 11499 |
| పెద్దవంగర | 9474 | 2486 | 11960 |
| సీరోలు | 6830 | 2043 | 8873 |
| తొర్రూరు | 17026 | 3973 | 20999 |
| మరిపెడ (ము) | 4965 | 925 | 5890 |
| తొర్రూరు(ము) | 6377 | 720 | 7097 |
| డోర్నకల్ (ము) | 3360 | 890 | 4250 |
| మహ-బాద్ (ము) | 20821 | 5185 | 26006 |
| **మొత్తం** | **2,44,506** | **65,114** | **3,09,620** |

# ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన

**● భూపాలపల్లిలో తరలొచ్చిన మహిళామణులు**

కృష్ణకాలనీ(భూపాలపల్లి)/భూపాలపల్లి టౌన్, జనవరి 6: 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' యేటా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ముగ్గుల పోటీ నిర్వహించింది. ఈ పోటీ ల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు యువతులు 154 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకే స్టేడియంకు చేరుకొని పేర్లు నమోదు చేసుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సంప్రదాయాలు ఉట్టి పడేలా, పల్లెటూరి వాతావరణాన్ని సంతరించుకునేలా గొబ్బెమ్మలు, పూలు, పండ్లు, పిండి వంటకాలతో వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముత్యాల ముగ్గుల పోటీలను తొలుత జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, భూపాలపల్లి పట్టణ సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై శ్రీలత, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నతో పాటు పలువురు అధికారులు ముగ్గులను చూసి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, నాయకులు ఇస్లావత్ దేవన్, క్యాతరాజు సాంబమూర్తి, పిప్పాల రాజేందర్, ఉడుత మహేందర్, రంజిత్, విజయ్ తదితరులు ముగ్గులను పరిశీలించారు. అనంతరం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు ఎ.రజిత, ఎం.లావణ్య ముగ్గులను పరిశీలించారు. 154 మంది వేసిన ముగ్గులను పరిశీలించి మార్కులను వేశారు.

**విజేతలకు బహుమతుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బహుమతులను అందించారు. ప్రథమ బహుమతి భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన ఈర్ల లావణ్య కైవసం చేసుకోగా.. ఆమెకు రూ.6వేల నగదును అందించారు. అలాగే ద్వితీయ స్థానంలో పరకాలకు చెందిన బోయిని రమాదేవి నిలువగా ఆమెకు రూ.4వేల నగదును, తృతీయ స్థానంలో నిలిచిన పట్టణంలోని టీటూ క్వార్టర్స్‌కు చెందిన పూదరి శైలజకు రూ.3వేల నగదును ఎమ్మెల్యే గండ్ర, ప్రముఖ వైద్యులు కేఎస్ కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నల చేతుల మీదుగా అందించారు. వీరితో పాటు కన్సోలేషన్స్ బహుమతి కింద కృష్ణకాలనీకి చెందిన కె.రమణ, జవహర్‌నగర్ కాలనీకి చెందిన చల్ల రమణలకు మెమొంటోలను బహూకరించారు.



ప్రథమ విజేతకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అలాగే పోటీల్లో పాల్గొన్న మహిళలకు ఎమ్మెల్యే గండ్ర చీరలను అందజేశారు. ముగ్గుల పోటీల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్న విషయం తెలుసుకొని ప్రతీ మహిళకు చీరలు బహుమతిగా ఇస్తానని ప్రకటించి అందించారు.

## 'నెలాఖరుకు జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి'

(5వ పేజీ తరువాయి)

క్యూలైన్లు పరిశీలించారు. ఈక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్‌లకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, ఈవో రాజేంద్రం, టెక్నికల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ ప్రణాళికను వివరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు క్యూలైన్ల ద్వారా వస్తూ ముడుపులు చెల్లించుకొని మొక్కులు సమర్పించుకుంటారని, ఈక్రమంలో నిలువెత్తు బంగారం(బెల్లం) మోసుకుంటూ వస్తారని తెలిపారు. భక్తులు సమర్పించే ముడుపులు, బెల్లం గద్దెలపైకి విసరకుండా నేరుగా తల్లులకు చేరేలా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమర్పించే బెల్లం, ముడుపులు అపవిత్రం కాకుండా భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భక్తులకు ఆర్వో వాటర్‌ను తాగునీరుగా క్యూలైన్లలో అందించనున్నట్లు తెలిపారు. దీంతో భక్తులకు మొక్కులు నేరుగా సమర్పించుకున్న సంతృప్తి కలుగుతుందని మంత్రి సీతక్క వెల్లడించారు. కార్యక్రమాలలో ఓఎస్‌డీ అశోక్‌కుమార్, ఏఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, ఈవో రాజేంద్రం, డీపీవో వెంకయ్య, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**పార్కింగ్ స్థలాల చదును పనుల ప్రారంభం**

మేడారం మహాజాతర అభివృద్ధి పనులలో భాగంగా పార్కింగ్ స్థలాల చదును పనులను పంచాయతీరాజ్ అధికారులు శనివారం ప్రారంభించారు. ఫిబ్రవరి 21నుంచి నాలుగు రోజులు సమ్మక్క, సారలమ్మల మహా జాతర జరుగనున్న నేపథ్యంలో భక్తులు వాహనాలు నిలుపుకునేందుకు 30 ప్రాంతాల్లో 800 ఎకరాలు రెవెన్యూ 400 ఎకరాలు అటవీ భూమిని కలిపి మొత్తంగా 1200 ఎకరాలలో చదును పనులు ప్రారంభించారు. వనదేవతల దర్శనానికి కోటిన్నర మందికి పైగా భక్తులు వస్తారనే అంచనా ఉండగా లక్షల సంఖ్యలో వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**రైతుల ఆందోళన**

గత జాతరలో పార్కింగ్ చదును పనులు పంట నష్టపోతున్న రైతులకు అప్పగించారని, ఈసారి రైతులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్లకు ఇవ్వడంతో పంట నష్టపోతున్నామని రైతులు ఎనగంటి భద్రయ్య, సిద్దబోయిన శివరాజు, గందం జనార్దన్, సంకె శ్రీనివాస్, రాజు, బాలయ్య, రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని, అదేవిధంగా గుంతలను వారిచే పూడ్చించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వాహనాలు పార్కింగ్ చేయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

## సీడీపీవో కమిషనరేట్‌కు సరెండర్

మహబూబాబాద్ రూరల్, జనవరి 6 : మానుకోట సీడీపీవో లిల్లి డెబోరాను పూర్వ జిల్లా కలెక్టర్ శశాంక హైదరాబాద్ కమిషనరేట్‌కు సరెండర్ చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విధి నిర్వహణలో సీడీపీవో అవకత వకలకు పాల్పడినట్లు గతంలో ఇన్‌చార్జి డీడబ్ల్యూవో నర్మద ఇచ్చిన నివేదిక ఆధారంగా డెబోరాను ఈనెల 3న హైదరాబాద్ కమిషనరేట్ కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వరలక్ష్మి చెప్పారు.